www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 21 జులై 2024
5
అన్నమయ్య



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని కస్తూర్బా విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని తహశీల్దార్ పుణ్యవతి, ఎంపిడిఒ నూర్జహాన్ ఆదేశించారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. వారికి మంచి విద్యతోపాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం వడ్డించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. మధ్యాహ్నం భోజనం తయారీ నాణ్యతలో రాజీపడొద్దని వారు సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి భువనేశ్వర్ ఆచారి, పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.



భోజనం తనిఖీ చేస్తున్న అధికారులు

గండికోటకు పూర్వ వైభవం వచ్చేనా?



ఎక్కడి పనులు అక్కడే..

సెప్టెంబర్‌లో ఉత్సవాలకు నోచుకునేనా?

ప్రభుత్వం దృష్టి సారించాలి

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

ఎంతో ఘన చరిత్రను గండికోట కలిగివుంది. పూర్వ వైభవాలను, అందాలను తనలో ఇముడ్చుకుని పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. 2014 నుంచి 2019 వరకు గండికోట పేరు పర్యటకంగా భారతదేశానికి తెలిసేలా అప్పటి ప్రభుత్వం చర్యలుసుకుంది. 2019 తర్వాత వైసిపి ప్రభుత్వం అందుకు తగ్గట్లు అడుగులు వేయలేదు. కరోనా కబంధాల నుంచి బయటికి రాలేక కేవలం సంక్షేమంపై శ్రద్ధపెట్టి చివరలో 2023 జులై 7న ఒబెరాయ్ హోటల్ గండికోటలో నిర్మిస్తున్నామని అందుకు శంకుస్థాపన చేశారు. గండికోటను 2014 నుంచి 2019 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏకంగా నాలుగు సార్లు గండికోటలో వారసత్వ ఉత్సవాలు నిర్వహించి ప్రపంచానికి కోట చరిత్ర తెలిసేలా చర్యలు తీసుకున్నారు. గండికోటలో సుమారు రూ.30 కోట్లు అభివృద్ధి కార్యక్రమాలు శ్రీకారం చుట్టారు. గండికోట 2015 సెప్టెంబర్ 26, 27, 28వ తేదీల్లో మొదటిసారిగా ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. వీటి కోసం సుమారు రూ.కోటి ఖర్చు చేశారు. రెండోసారి 2017 ఫిబ్రవరి 18, 19 తేదీల్లో అప్పటి కలెక్టర్ కేవీ సత్యనారాయణ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఉత్సవాలు నిర్వహించారు. మూడో సారి 2018 జనవరి 21, 22, 23 తేదీల్లో అప్పటి కలెక్టర్ బాబూరావు నాయుడు, సంయుక్త కలెక్టర్ శ్వేతా దగ్గరుండి పనులు పరిశీలించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందుకు సుమారు రూ.రెండు కోట్లకు పైగా ఖర్చు పెట్టారు. 10 వేల మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. నాలుగవ సారి 2019 ఫిబ్రవరి 9, 10వ తేదీల్లో ఘనంగా వారసత్వ ఉత్సవాలను అప్పటి కలెక్టర్ హరికిరణ్ నిర్వహించి కోట విశిష్టతను చాటి చెప్పారు. సుమారు రూ.మూడు కోట్లకుపైగా ఖర్చు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని కళాకారులను రప్పించి ప్రదర్శనలు జరిపారు. కళాజాతలు నిర్వ హించి ఈ పండుగ వాతావరణం తీసుకు వచ్చారు. తర్వాత ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి 2020లో వారసత్వ ఉత్సవాలు కలెక్టర్ హరికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తరువాత కరోనా సమయంలోనూ, కరోనా తర్వాత ఉత్సవాలు జరపకుండా గండికోట వైభ వానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇక నైనా వచ్చే సెప్టెంబర్ నెలలో పర్యాటక దినో త్సవం సందర్భంగా ఉత్సవాలు జరిపేలా స్థానిక ఎమ్మెల్యే, ఆర్‌డిఒ, కొత్తగా వచ్చిన కలెక్టర్ శివ శంకర్‌కు తెలిపి ఉత్సవాలు ఘనంగా నిర్వహిం చేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గండికోటలో ఎక్కడి పనులు అక్కడే...

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గండికోట లోయను చూసి అమెరికాలోని గ్రాండ్ కెన్యాన్ తర్వాత అంతే అందంగా ఉందని ఇండియన్ గ్రాండ్ కెన్యాన్‌గా గండికోట వద్ద గల పెన్నా లోయ సమీపంలో సుమారు రూ.7 కోట్లతో రోప్ వే పనులకు శంకుస్థాపన చేశారు. మధ్యలోనే ఆగి పోయింది. దానిని పూర్తి చేయాలి. గండికోటలో రాపెల్లింగ్, జుమ్మారింగ్, కాయకింగ్, బోటింగ్, పారా మోటో రింగ్ తదితర సాహసకృత్యాల క్రీడలు కూడా అందుబాటులో ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమయ్యారు. గండికోట ప్రపంచ పర్యాటక కేంద్రాలలో ఒకటి కావడం వలన ఇక్కడికి శుక్రవారం రాత్రి నుంచి శని, ఆదివారాలలో వేల సంఖ్యలో రాష్ట్రం, దేశం నలుమూలల నుంచి వచ్చే సందర్శకుల తాకిడి అధికంగా వుంటుంది. ఎంతో ఉత్సాహంతో వచ్చిన పర్యాటకులకు గండికోట లోపల ఉన్న రహదారిని, ఇతర మౌలిక వసతుల కల్పన లోపం చూసి పెదవి విరుస్తున్నారు. కొత్త ప్రభుత్వం వాటిపై శ్రద్ధ చూపాలని పర్యాటకులు కోరుతున్నారు. పర్యాటకులు కోటలోపల చూసేందుకు చార్మినార్, జైలు (కారాగారం), మాధవరాయస్వామి దేవాలయం, కత్తుల కోనేరు, జుమ్మా మసీదు, ధాన్యాగారం, రంగనాథస్వామి దేవాలయం, రాణి మహల్ వంటి అనేక చూడదగ్గ ప్రదేశాలతో పాటు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన అమెరికా గ్రాండ్ కాన్యన్ లాంటి పెన్నాలోయకు వెళ్లేందుకు సరైన రోడ్డు సదుపాయాలు లేవు. గత వైసిపి ప్రభుత్వం జూలై 7, 8, 9వ తేదీలలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రూ.250 కోట్ల పెట్టుబడులతో 50 ఎకరాలలో 120 విల్లాలను ఏర్పాటు చేసేందుకు 99 సంవత్సరాలు పాటు భూమిని లీజుకు ఇచ్చారు. నాటి నుంచి నేటి పనులు ముందుకు సాగలేదు. ఎన్నికల కంటే ముందు కోట ప్రవేశానికి కుడి వైపున సుమారు 5 ఎకరాలలో రూ.2.8 కోట్లతో హార్స్ రైడింగ్ పనులు ప్రారంభించి, ప్రస్తుతం ఆపారు. వాటిని పునరుద్ధరణ చేసి త్వరగా పూర్తి చేయాలి. స్వదేశీ దర్శన్ కింద రోప్ వే పనులు కేంద్ర ప్రభుత్వం చేస్తామని అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆ పనులు చేపట్టిందని చెబుతున్నా ముందుకు సాగడం లేదు. కోట లోపల జుమ్మా మసీదు, చార్మినార్, మాదవరాయస్వామి దేవాలయం వద్ద గ్రీనరి, లైటింగ్ పనులు జరగాల్సి ఉంది. ప్రస్తుతం నిలబడి పోయాయి. కోట లోపల బయట 80 అడుగుల వెడల్పు తో రోడ్డు వేసేందుకు సర్వే చేశారు. పనులు జరగలేదు. జమ్మలమడుగు నుంచి గండికోటకు ప్రస్తుతం రెండు లైన్ల రోడ్డు ఉంది. 4 లైన్ రోడ్డు వేస్తే ప్రమాదాలు అరికట్టడమే కాక ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.



స్థానికులకు అవకాశం కల్పించాలి

టూరిజం అభివృద్ధిలో బయటివారికి అవకాశం ఇవ్వకుండా స్థానికులకు 80 శాతం మేర అవకాశం ఇవ్వాలి. గండికోట గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం కమిటీ ఏర్పాటు చేసి స్థానికుల అభివృద్ధికి కృషిచేయాలి.

- కామాటి గురుఈశ్వర్, సర్పంచ్, గండికోట.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

గండికోటలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. పర్యాటకులు తాగడానికి స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేవు. కనీసం గ్రామస్తులకు కూడా తాగునీరుతో ఇబ్బంది పడుతున్నారు. గండికోట గ్రామంలో ఉన్న వారు టాయిలెట్స్ నిర్మాణం కోసం ఆర్కియాలజీ వారు పర్మిషన్ ఇవ్వడం లేదు. పబ్లిక్ టాయిలెట్స్ నిర్మిస్తే సమస్య పరిస్కారం అవుతుంది.

- వీరణాల శివకుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

ఉత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి

సెప్టెంబర్ నెలలో పర్యాటక దినోత్సవం సందర్భంగా ఏటా ఉత్సవాలు నిర్వహిస్తారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గండికోట పర్యటకంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలి.

- దాసరి విజయ్, సిఐటియు పట్టణ కార్యదర్శి.

నిర్లక్ష్యంతోనే విద్యుత్ ప్రమాదాలు : ఎస్ఇ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఇ, అధికారులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యుత్ ప్రమాదాలు అధిక శాతం నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయని ఉమ్మడి జిల్లా విద్యుత్ ఎస్ఇ ఎస్.రమణ అన్నారు. మండలంలోని 33/11 కె.వి సబ్‌స్టేషన్, గుండాలపల్లి, వివి కండ్రిగ తదితర ప్రాంతాలలోని ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యటించే పరిశీలించారు. అనంతరం కోడూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని కోడూరు, చిట్వేటలి, ఒబులవారిపల్లి మండలాల అధికారులు, సిబ్బందితో ఎడి కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూజు లైన్లను, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అధిక శాతం విద్యుత్ ప్రమాదాలు నిర్లక్ష్యంతోనే సంభవిస్తున్నాయన్నారు. అప్రమత్తతతో ప్రమాదాలు నివారించాలని తెలిపారు. క్షణం ఆలోచించి ఎత్తయిన లోడుతో వెళ్లేటువంటి వాహనాలు పైన ఉన్న లైన్లను గమనించి ముందుకు వెళ్లాలని సూచించారు,విద్యుత్ పనులు చేసేటప్పుడు విధిగా సిబ్బంది భద్రత నియమాలు పాటించాలని హెచ్చరించారు.పాటించని వారిపై తగు చర్యలు తప్పవన్నారు. ఈ మండలాలు వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు కావున రైతుల విద్యుత్ సమస్యలైన ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు వేయడం, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం వంటి తదితర పనులపై వెంటనే స్పందించాలన్నారు. వినియోగదారులతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి వారి విద్యుత్ సమస్యలను పరిష్కరించి సంస్థపై వారి సంతృప్తికర స్థాయిని పెంచే విధంగా ప్రతి ఉద్యోగి విద్యుత్ సేవలు అందించాలని ఆదేశించారు. ప్రజల సహకారం లేనిదే విద్యుత్ ప్రమాదాలు నివారించలేమన్నారు. విద్యుత్తును భూతంలా చూడాలి, జాగ్రత్తలు వహించాలి, విద్యుత్ అంతరాయాలను పూర్తిగా నివారించాలని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణ లక్ష్యంగా ముందుకు వెళ్లాలని, సంస్థపై వినియోగదారుని సంతృప్తికరస్థాయిని పెంచే విధంగా సేవలు అందించాలని తెలిపారు. అంతరాయాలు అధికంగా ఉన్న లైన్లలో తిరిగి సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మతులు చేసి అంతరాయలను అరికట్టి నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆదేశించారు. లోవోల్టేజి సమస్యలు తలెత్తకుండా అవసరమైనన్ని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచుటలో భాగంగా విద్యుత్ స్తంభాలను తాకకుండా, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకకుండా మరమ్మత్తులు విద్యుత్ శాఖ సిబ్బందితో చేయించుకునే విధంగా ప్రజలలో అవగాహన కల్పించుటకు వార్తాపత్రికల ద్వారా, లోకల్ టివిల ద్వారా ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించి విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని తెలియచేసారు. విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వినియోగదారుడు తమ విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు క్షేత్ర స్థాయిలోని సిబ్బంది,అధికారులు వారితో మమేకమై మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి విద్యుత్ సమస్యలను సావధానంగా విని పరిష్కరించాలని తెలియజేశారు. సమావేశంలో రాజంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్‌రెడ్డి, రైల్వేకోడూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కరరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యోగానందం, చలపతి, కిరణ్, జెఇలు, అకౌంట్స్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సౌమ్యనాథ స్వామి కల్యాణం



సౌమ్యనాథుని కల్యాణంలో మాంగల్యం చూపుతున్న ఆగమశాస్త్ర పండితులు

ప్రజాశక్తి-నందలూరు

రమణీయం కమనీయం రీతిలో సౌమ్యనాథుని కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి కల్యాణం చూచువారులకు చూడముచ్చటగా సాగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో కల్యాణ వేదికను అలంకరించారు. ఆలయ అర్చకులు సునీల్‌కుమార్ శర్మ బృందంచే శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకలకు ఉత్సవమూర్తులను ముస్తాబు చేసి మేళతాళాల మధ్య కళ్యాణ వేదికపైన ఆశీనులు గావించారు.పండితుల మంత్రోచ్ఛారణలు, పసుపులేటి శివశంకర్ వ్యాఖ్యానంతో భక్తులు గోవింద నామస్మరణలతో ఆలయం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. ఉదయం అభిజిత్ లగ్నమందు పాంచరాత్ర ఆగమ ప్రకారం కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మాంగల్య ధారణ, ముత్యాల తలంబ్రాలు క్రతువులను నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, మేడా విజయ శేఖర్‌రెడ్డి, టిటిడి డిప్యూటీ ఇఒ నటేష్ బాబు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. వారందరినీ పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కల్యాణానికి హాజరైన ప్రముఖులు : సౌమ్యనాథుని కల్యాణ మహోత్సవానికి ఆర్‌టిసి మాజీ రీజినల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, రాజంపేట ఆర్‌డిఒ రమణరావు, డిఎస్‌పి వి.ఎన్.కె.చైతన్య, ప్రముఖ నటుడు, దర్శకులు తోట వేణు గోపాల్, జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్, గీతాంజలి విద్య సంస్థల అధినేత రమణ, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎద్దుల విజయ సాగర్, టిడిపి నాయకులు పల్లె సుబ్రహ్మణ్యం, గంట వాసుదేవయ్య, సుబ్బయ్య, రామసుబ్బన్న హాజరయ్యారు.

భక్తులకు అన్నదానం : కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి చైతన్య, మన్నూరు సిఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్రాజ్ ఆధ్వర్యంలో స్కౌట్ సభ్యులు భక్తులకు సేవలు అందించారు. కల్యాణ మహోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి మాడవీధుల్లో విహరించారు. భక్తులు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథ స్వామి గజ వాహనంపై మాడావీదులలో ఊరేగారు. కార్యక్రమంలో టిటిడి సూపరిండెంట్ హనుమంతు, ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. **బ్రహ్మోత్సవాల్లో నేడు:** బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం వైభవంగా రథోత్సవం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. రథంపై శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు.



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న కమిషనర్

ప్లాస్టిక్ కవర్ల వినియోగం వద్దు

- మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని దుకాణదారులు, వాణిజ్య సముదాయాల యజమానులు దుకాణలు ప్లాస్టిక్ వాడకం నిషేదించాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు అన్నారు. శనివారం పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం లో భాగంగా పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం అందరి బాధ్యత అని కేంద్ర ప్రభుత్వం 2022 లో 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ పరిమాణం ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పై పూర్తి నిషేధం విధించినట్లు తెలిపారు. గతంలోనే అనేక సార్లు ప్లాస్టిక్ వినియోగం, కలిగే నష్టాలపై అవగాహన కల్పించినా మార్పు రావడం లేదని అన్నారు. ఇకపై ప్లాస్టిక్ వాడకం పూర్తిస్థాయిలో నిషేధించేంతవరకు రోజూ తనిఖీలు నిర్వహిస్తామని, దుకాణ దారులు సహకరించాలని కోరారు. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే 120 మైక్రాన్ కన్నా తక్కువ పరిమాణం గల ప్లాస్టిక్ కవర్లను వినియోగించినా, అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణాదారులు చెత్తబుట్ట ఉండేలా చూడాలని ప్రజలు పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతీ పౌరుడు సహకరించాలని పిలుపునిచ్చారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో దాదాపు 300 కిలోలకుపైగా ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేశామన్నారు. మళ్ళీ పునరావృతమైతే భారీ జరిమానాతో పాటు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సీజ్ చేసిన ప్లాస్టిక్ మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, పోలీస్ సిబ్బంది శానిటరీ, ఇతర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని ఆయా గ్రామాలలో ఆధార్ కార్డు ఉన్నవారు అప్డేట్ చేసుకుని, లేని వారు కొత్తగా నమోదు చేసుకోవాలని ఎంపిడిఒప్రభాకర్ తెలిపారు. ఈనెల 23 నుంచి గ్రామాల వారిగా 27 వరకు శిబిరాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. 23న కుమ్మరపల్లి, వెంకట రెడ్డిగారిపల్లి, గువ్వలచెరువు, 24న కసిరెడ్డి గారి పల్లి కొత్తపల్లి, భయ్యా రెడ్డి గారి పల్లి, సూర్యనారాయణపురం, 25న చిట్లూరు, సరస్వతి పల్లి, కల్పనాయిని చెరువు, 26న పప్పిరెడ్డి గారి పల్లి, నీలకంఠరావుపేట, 27న రాచపల్లి గోపిగుడిపల్లిలో కాగా సరస్వతి పల్లి గువ్వల చెరువులలో స్పెషల్ మొబైల్ క్యాంపులు ఉంటాయన్నారు. అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'కస్తూర్బా' ప్రిన్సిపల్ సహా నలుగురు సస్పెన్షన్

ప్రజాశక్తి-బి.కొత్తకోట: కురబలకోట మండలంలోని ముదివేడు కస్తూర్బా పాఠశాల ప్రిన్సి పల్ సహా నలుగురిపై సస్పెన్షన్ వేటు పడింది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రెండు రోజుల క్రితం 9వ తరగతి చదివే ముగ్గురు బాలికలు మాత్రలు మింగి ఆత్మహత్నం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ప్రిన్సిపల్ రఫియా పర్వీన్, హిందీ టీచర్ గౌషియా మస్తానీ, ఎఎన్ఎం భాను, అకౌంటెంట్లను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శ్రీధర్ చామకూరి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థునులు సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నియోజకవర్గంలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. శనివారం సాయంత్రం మదనపల్లె నియోజకవర్గంలో విజృంభిస్తున్న సీజనల్ జబ్బులు, డెంగీ, మలేరియా, విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎమ్మెల్యే నివాసం వద్ద అత్యవసర సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, పి.హెచ్.సి సెంటర్ల డాక్టర్లు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, హెల్త్ అసిస్టెంట్లు, మున్సిపాలిటీ, సచివాలయ సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, డిఎల్‌పిఒ నాగరాజు, మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనా సుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎమ్మెస్ రాజు, ఆర్ఎంఒ ప్రసాద్ రాజు, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల ఎంపిడిఓలు బానుప్రసాద్, షాలెట్, వేణుగోపాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఎక్కడ కానీ తాగునీటి కాలుష్యం జరగకుండా వాటిని వెంటనే అరికట్టాలన్నారు. వర్షపు నీరు మురుగునీరు నిల్వ ఉండకుండా వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఇదే క్రమంలో ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. దోమల నియంత్రణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. మురుగునీరు ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడంతోపాటు మలాథియాన్ స్ప్రే చేయాలన్నారు. గ్రామాలలో అవసరమైన చోట ఫాగింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎక్కడైనా అంటువ్యాధులు ప్రబలాయని విషయం తెలిసిన వెంటనే అధికారులు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపైన వీటి నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపైన అవగాహన పెంచాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

ప్రజాశక్తి- రామాపురం : రైతులు రసాయనాల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలని డిఆర్‌సి ఎడిఎ అశోక్‌రెడ్డి అన్నారు మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బి.రాచపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో శనివారం ఆయన హాజరై మాట్లాడారు. రైతులు వ్యవసాయంలో రసాయన వాడడం వల్ల ఖర్చులు పెరగడంతోపాటు భూసారం తగ్గిపోయి వాతావరణ సమతుల్యం దెబ్బతింటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహక పథకాలను అందజేస్తున్నాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి పెంచుకోవాలని పేర్కొన్నారు. ఎడిఎ జయరాణి మాట్లాడుతూ రైతులు అనాదిగా చేస్తున్న వ్యవసాయ పద్ధతులు మరిచి, రసాయనిక వాడకాల వల్ల వ్యవసాయానికి పెట్టుబడులు ఖర్చు ఎక్కువ అవుతుందని చెప్పారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ వి.శిల్పకళ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే ద్రవాలు కషాయాల తయారీ విధానంవాడిని ఉపయోగించే విధానం గురించి వివరించారు. ఉద్యానవన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మానస మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఉద్యానవన పంటలు కూరగాయలు పండ్లు పసుపు పూలతోటల్లో వాడవలసిన ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, టైం వన్ టైం టు ద్రవ్య జీవామృతం పంచగవ్య కోడిగుడ్ల ద్రావణం, సప్త కూర ద్రవణం, సస్యరక్షణ, అంతర్ పంటలు 365 రోజులు ఆచరణ, పిఎండిఎస్ వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎఒ వై.నాగమణి డిఆర్‌సి వ్యవసాయ అధికారి సుచిత్ర ట్రైనర్ మధుకర్ ఆదర్శ రైతు శ్రీనాథ్‌రెడ్డి, విఎఎలు, విహెచ్ఎలు, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సవాళ్లే!

ప్రజాదృష్టి

జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుల విధులు కత్తిమీద సామును తలపించనుంది. ఇటీవలే వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల ఎస్‌పిలుగా హర్షవర్దన్‌రాజు, విద్యాసాగర్ నాయుడు నియమితులయ్యారు. వైఎస్ఆర్ జిల్లా ఎస్‌పివిధులను సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉంది. జిల్లాలో ఒక వైపు హత్యలు, భూ కబ్జాలు, మరోవైపు ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణా వంటి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల భాగస్వామ్యం ఎంతైనా ఉండక పోదు. ఇటువంటి పరిస్థితుల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల్లో ఎవరి వైపు మొగ్గు చూపినా ప్రతిఫలాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో విధి నిర్వహణలో అడుగడుగునా ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలి. ప్రతిపక్ష వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ సొంత జిల్లా వాసి కావడంతో పోలీస్ సూపరింటెండెంట్ పనితీరుపై అందరిదృష్టి నిలిచే అవకాశం ఉంది. కూటమి నాయకులు అధికారంలో ఉన్న నేపథ్యంలో జిల్లాలో చోటుచేసుకునే చిన్నపాటి ఘటన సైతం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. సదరు ఘటన రాజకీయంగా చిటపటలను ఎదుర్కోవాల్సి వస్తుందని గమనించాలి. గతంలో జిల్లాలో చోటుచేసుకున్న హత్యలు, కబ్జాలు, పోలీసులపైనే కేసులు బనాయించిన ఘటనల వ్యవహారాలు ఉత్కంఠను కలిగించే అవకాశం ఉంది. గతంలో చోటుచేసుకున్న ఓహత్యపై సిఐడి విచారణ చేపట్టింది. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ప్రతీకార రాజకీయాల నేపథ్యంలో పోలీసు విధులు కత్తి మీద సామును తలపించే అవకాశం కనిపిస్తోంది. అన్నమయ్య జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విద్యాసాగర్ నాయుడు సమర్థతను నిరూపించుకోవాలి. గత ప్రభుత్వ హయాంలో మదనపల్లి సమీపంలోని అంగళ్ల దగ్గర చోటు చేసుకున్న ఘటన తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో చెలరేగిన అల్లర్లు చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటన సందర్భంగా టిడిపి కేడర్ సృష్టించిన అల్లర్ల నేపథ్యం తరహా ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉంది. అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఉంది. కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో ప్రపంచంలోనే అరుదైన, ఖరీదైన ఎర్రచందనం లభిస్తోంది. ఇక్కడి నుంచి దశాబ్దానికిపైగా ఎర్రచందనం అక్రమ రవాణా యధేచ్ఛగా సాగిపోతోంది. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడానికి జిల్లా అధికార యంత్రాంగాలు సాహసించిన పాపాన పోలేదు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఎర్రచందనం, మట్టి, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడం కత్తి మీద సామును తలపించే అవకాశాలు పుష్కలం. ఎస్‌పిలు బాధ్యతలు నిర్వహించడం కఠిన సవాళ్లను స్వీకరించడమే అవుతుందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ సుజాత

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం : సిడిపిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అంగన్వాడీ కేంద్రాల నుంచి గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు సిడిపిఒ సుజాత తెలిపారు. శనివారం నిమ్మనపల్లి అంగనవాడి కేంద్రంలో చిన్నపిల్లల తల్లులతో సంపూర్ణ పోషణ ఆహారంపై 100 రోజుల ప్రత్యేక అవగాహన సమావేశం ఏర్పాటు చేసి అంగన్వాడీ కేంద్రాల నుంచి అందుతున్న పౌష్టిక ఆహారంపై, వాటి లాభాలపై, పోషకాలపై అవగాహన కల్పించినట్లు వివరించారు. గర్భిణులు, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలు, వారి తల్లులకు అందించే పౌష్టికాహారాన్ని వారు మాత్రమే తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో 3 నుంచి 6 సంవత్సరాలలోపు ప్రీ స్కూల్‌లో నమోదు చేసుకున్న పిల్లలందరూ అంగన్వాడీ కేంద్రంలో హాజరు కావాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అతిసారా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. రక్తహీనత నివారణకు గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ భాను లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్త ముంతాజ్ పాల్గొన్నారు.

అరుణాచలం వెళ్లే యాత్రికులకు అన్నదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని స్థానిక సొసైటీ కాలనీకి చెందిన రాజేంద్ర ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకొని దైవదర్శనం కోసం తమిళనాడులోని అరుణాచల శివుడి సందర్శన కోసం ప్రత్యేకంగా రెండు బస్సులను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం స్థానిక సొసైటీ కాలనీలోని రామాలయం నుండి రెండు ప్రయివేట్ బస్సుల్లో యాత్రికులు అరుణాచల దర్శనానికి బయలు దేరారు. స్వామి వారి దర్శనం కోసం బయలుదేరిన భక్తులకు సొసైటీ కాలనీకి చెందిన ఎబిసి ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి అన్నప్ర సాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాజేంద్ర, ఆయన సతీమణి భక్తాదులు సంయుక్తంగా అన్నదాతకు కృతజ్ఞతలు తెలిపారు. పూలమాల, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా అప్పినపల్లి భాస్కరాచారి మాట్లాడుతూ ప్రతినెల అరుణాచలానికి వెళ్లే భక్తుల కోసం తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. ఆధ్యాత్మిక వాతావరణం, దైవభక్తిలోనే మానవజీవితానికి ప్రశాంతత, ఆరోగ్యం, సేవాభావం కలుగుతాయన్నారు. నిర్వాహకులు రాజేంద్ర మాట్లాడుతూ దర్శనం కోసం ఆసక్తిగా ఎదురుచూసే భక్తులు కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థులకు కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి-కలికిరి : 2024-25 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు సరఫరా చేయబడిన స్టూడెంట్ కిట్స్‌ను శనివారం ఎంపిపి పాఠశాలలో కలికిరి పంచాయతీ సర్పంచ్ ఎల్లయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కరిముల్లా మాట్లాడుతూ పిల్లలు ఇంటికి వెళ్లిన తర్వాత పాఠశాలలో జరిగిన పాఠాలను విషయాల వారీగా ఒక్కసారి మననం చేసుకుంటే విద్య చక్కగా అలవడుతుందని పేర్కొన్నారు. పిల్లలచేత తాము పాఠశాలకు ప్రతిరోజు హాజరై పాఠాలను చక్కగా నేర్చుకుంటామని ప్రతిజ్ఞ చేయిస్తున్నామని తెలిపారు. తీసుకున్న ఈ కిట్లను సక్రమంగా వినియోగించి ప్రతిరోజు పాఠశాలకు యూనిఫామ్, ష్యూస్ మొదలగునవి వేసుకొని రావాలని సూచించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురాషావలి, సిఆర్‌పి సురేష్, గ్రామ ప్రముఖులు యోగేష్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ : ఎంపిడిఒ

ప్రజాశక్తి-కలికిరి : వినాయక చవితి పండుగకు ప్రజలందరూ మట్టి విగ్రహాలను వాడి పర్యావరణాన్ని కాపాడదామని ఎంపిడిఒ రామక్రిష్ణ సిబ్బందికి సూచించారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హిత మట్టితో తయారు చేసిన గణేష్ విగ్రహాలను మాత్రమే వాడాలని తెలిపారు. పిఒపి, కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి అవగాహన కల్పించాలన్నారు. చట్ట ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలకు ప్రతి ఇంటిలో మట్టి గణపతితో జరుపుకోవాలని కోరారు. కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సయ్యద్ అహ్మద్, ట్రాన్స్‌కో ఎఇ రెహమాన్, మండల విద్యాధికారి కరిముల్లా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, విఆర్‌ఒలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్** : పిఒపి వినాయక ప్రతిమల ఏర్పాటుతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని మదనపల్లె ఆర్‌డిఒ హరిప్రసాద్ సూచించారు. శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థి నిలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణహిత మట్టితో తయారు చేసిన గణేష్ విగ్రహాలను మాత్రమే వాడాలని, పిఒపి, కృత్రిమ రంగులతో తయారు చేసిన విగ్రహాలు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి వివరించారు. చట్ట ప్రకారం నడుచుకోవాలని, వినాయక చవితి ఉత్సవాలను ప్రతీ ఇంటిలో మట్టి గణపతితోనే జరుపుకోవాలని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు పిఒపి విగ్రహాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి కుటుంబ సభ్యులకు, ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భానుప్రసాద్, ఎంఇఒ ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సేగు రెడ్డెప్ప రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నేత మృతి

ప్రజాశక్తి- కలకడ : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత హీరో షోరూం యజమాని సుకూర్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుకూర్ మృతి పార్టీకి తీరనిలోటని మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, కలకడ టౌన్ అధ్యక్షులు వై.జిలాని బాష తెలిపారు. తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుండి నేటి వరకు పార్టీలో ఉంటూ క్రియాశీలక పనులు ఎన్నో చేస్తూ పార్టీకే అండగా ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తూ మృతి చెందిన సుకూర్ సేవలు మరువ రానివని కొనియాడారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి నియోజకవర్గంలో అందుబాటు లేకపోవడం వల్ల ఫోను ద్వారా సుకూర్ మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించి నట్టు సుమార్ కుమారుడు ఇమ్రాన్ తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోమటివానిచెరువులో వ్యర్థాలను తొలగించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణ నడిబొడ్డున ఉన్న కోమటివానిచెరువు ప్రక్షాళనకు చర్యలు చేపట్టాలని పట్టణ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతి రావు, సభ్యులు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ చెరువులో వ్యర్థపదార్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, జంతు కళేబరాలు వేయడంవల్ల నీరు కలుషితమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో పెద్ద ఎత్తున చెత్తా చెదారం పేరుకుపోయి అందులో నుండి వెలువడుతున్న దుర్గంధంతో కట్టరోడ్డుపై ప్రయాణం చేసే వాహనదారులు,పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. పురపాలక సంఘం అధికారులు వెంటనే చర్యలు తీసుకొని చెరువులోని వ్యర్థపదార్థాలు తొలగించి అంటువ్యాధుల బారిన ప్రజలు పడకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు.



వ్యర్థాలతో నిండిపోయిన కోమటివాని చెరువు

మౌలిక వసతులపై చర్యలు చేపట్టండి : ఎంపిపి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

గ్రామాలలో మౌలిక వసతులపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపిపి డి.నరసింహులు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి డి.నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపిపి నరసింహులు, జడ్‌పిటిసి కె.ప్రమీలమ్మ, వైస్ ఎంపిపిలు కె.సుజాత, జయప్రకాశ్‌రెడ్డి హాజరై వివిధ శాఖల త్రైమాసిక ప్రగతిని సమీక్షించారు. అధికారులు తమ శాఖల త్రైమాసిక ప్రగతి నివేదికను సమావేశంలో చదివి వినిపించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చి, తక్షణం పరిష్కరించాలని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీటి ట్యాంకర్లను బ్లీచింగ్‌తో శుభ్రపరచాలన్నారు. మరుగునీటి కాలువలను, చెత్తాచెదారాన్ని వెంటనే శుభ్రపరచాలని ఆదేశించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని, ప్లాస్టిక్ పదార్థాలతో తయారుచేసిన విగ్రహాల అమ్మకాలను నిషేధించినట్లు తెలిపారు. రైతులు అధిక దిగుబడులు సాధించడానికి భూసార పరీక్షలను చేయించుకోవాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 6,449 మంది రైతులకు పిఎం కిసాన్ నిధులు అందుతున్నాయని వ్యవసాయ అధికారి తెలిపారు. బహుదా ప్రాజెక్టు కుడి కాలువ మరమ్మతు పనులను చేపట్టాలని వైస్ ఎంపిపి జయప్రకాశ్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి రహదారులు భవనాల శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ కు సంబంధించిన అధికారులు గైర్హాజరయ్యారు. కొంతమంది అధికారులు సర్వసభ్య సమావేశానికి ఆలస్యంగా రావడంపై ఎంపిపి అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షాలెట్, డిప్యూటీ తహశీల్దార్ తపస్విని, ఇఒపిఆర్‌డి చలపతిరావు, డాక్టర్ ప్రత్యూష, సిడిపిఒ సుజాత, ఎపిఎం రజనీకుమారి, ఎపిఒ రమేష్, డాక్టర్ సురేష్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నరసింహులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. మదనపల్లె పట్టణం 25వ వార్డు నక్కలదిన్నె నుండి పొన్నూటి పాళెంకు వెళ్ళే రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వార్డులలో పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణాన్ని కాపాడుకొందామని పిలుపునిచ్చారు. ప్రస్తుతం వాతావరణం, వాయు, శబ్ద కాలుష్యం అధికమై మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతూ ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో వేలాదిగా మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతివారం పట్టణంలో ఏదో ఒక ప్రాంతంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులతో పాటు స్థానిక ప్రజలపైన ఉందన్నారు. మొక్కలు నాటే మహా యజ్ఞంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 25వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి రవి నాయక్, శీనా నాయక్ మాట్లాడుతూ పచ్చదనం వల్ల చల్లదనం, ప్రజలకు ప్రాణ వాయువు అందడంతో పాటు వాయు, శబ్ద కాలుష్యం తగ్గుతుందన్నారు. టిడిపి నాయకులు హరినాయక్, మధు నాయక్, వేణుగోపాల్ నాయక్, దిలీప్ మేస్త్రి, శారదా, చౌలమ్మ, భారతి, చిట్టెమ్మ, మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి, రాధమ్మ, బాలమాలి శేఖర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

విషజ్వరాల నుంచి ప్రజలను కాపాడండి

మున్సిపల్ కమిషనర్‌కు న్యాయవాదుల ఫిర్యాదు

ప్రజాశక్తి- రాయచోటి

విష జ్వరాలకు కారణమైన దోమలను ఉత్పత్తి చేసే కేంద్రంగా మారిపోయిన మాండవ్య నదిని శుభ్రం చేసి, ప్రజలను విషజ్వరాల నుంచి కాపాడాలని భారత న్యాయవాదుల సంఘం రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు బాబును శనివారం కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. భారత న్యాయ వాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్, అన్నమయ్య జిల్లా న్యాయవాదుల సంక్షేమ సమితి అధ్యక్షులు రాజకుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, ఐఎఎల్ న్యాయ వాదులు పి.రెడ్డయ్య, హోమయోన్‌బాష, చిన్నయ్య, అక్బర్ అలీ మాట్లాడుతూ రెండు రోజుల కిందట మాండవ్య నదీ పరివాహక ప్రాంతాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నామని వారు కమిషనర్‌కు వివరించారు. రాయచోటి పట్టణంలోని 30 వేల కుటుంబాల డ్రెయినేజీ అంతా కూడా మాండవ్య నదిలో వెళుతోందని, డ్రెయినేజీ నీటిని రాయచోటి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని చల్లంపల్లి సమీపంలో నదికి ఇరువైపులా ఉన్న కాలువలు ద్వారా వెళ్లిపోయేటట్లు చేయాలని లేనిపక్షంలో ప్రజలు డెంగీ, మలేరియా విష జ్వరాల బారిన పడి లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకోలేక ప్రాణాలు కోల్పోతారని వారు తెలిపారు. నదికి ఇరువైపులా ఉన్న కాలువలు పూడికలతో నిండిపోవడం వల్ల రాయచోటి మురుగు నీరంతా మాండవ్య నదిలో చెరువుల్లాగా తయారైందని తెలిపారు. కాలువలను తక్షణం పూడికలు తీయించి డ్రెయినేజీ నీటిని పట్టణానికి దూరంగా వదిలేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమిషనర్ డ్రెయినేజీ నీరు మాండవ్య నదిలోనికి వెళ్లకుండా చర్యలు తీసుకుని దోమల నివారణ తక్షణం చేపడతామని న్యాయవాదులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా రాయచోటి పట్టణ డ్రెయినేజీ వాటర్‌ను శుభ్రపరిచి నదిలోనికి వదిలేసే ప్రాజెక్టులను భవిష్యత్తులో తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఆయన న్యాయవాదులకు తెలియజేశారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

'హెల్మెట్ వినియోగం తప్పనిసరి'



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, ఎన్‌సిసి విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రయాణంలో శిరస్త్రాణమే రక్షణ కవచమని వక్తలు వెల్లడించారు. పట్టణంలోని బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు హెల్మెట్ వినియోగించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం శిరస్త్రాణం ధరించడం వలన కలిగే ప్రయోజనాలపై చైతన్యపరుస్తూ పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలోని కింగ్ రూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఆధునిక మానవ జీవితంలో ప్రమాదాలు ఒక భాగమైపోయాయని, ప్రాణనష్టం జరగడానికి హెల్మెట్లు ధరించకపోవడమే ప్రధాన కారణమవుతోందన్నారు. అందు వలన ద్విచక్ర వాహనదారులు అందరూ తప్పక హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ లేకపోవడం వలన ఆర్థిక సహాయం అందక ఇరుపక్షాలు చాలా నష్టపోతున్నారన్నారు. కావున వాహన దారులందరూ తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. తదనంతరం విద్యార్థులు, అధ్యాపకులు కలిసి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో గడ్డిని తొలగించి, చెత్తను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీదేవి, ఆంధ్రప్రదేశ్ అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శైలజ, సిఎస్, కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ డి.శ్రీనివాసులు, కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ జి.చిన్నారెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-19 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. శనివారం వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టుపై 5 వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన విశాఖపట్నం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 280 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఈశ్వర్ రిత్విక్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 101 పరుగులు చేశాడు. జిహెచ్. వర్మ 81 పరు గులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జట్టులోని కె.సాత్విక్ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 281 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ జోన్ జట్టు 46.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని ఆనంద్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 129 పరుగులు చేశాడు. రేవంత్ నాగ కుమార్ 63 పరుగులు చేశాడు.



తలపడుతున్న విశాఖపట్నం, రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్లు

ఆరు వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టుపై ఆరు వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 43.0 ఓవర్లలో 159 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని గురు చరణ్ 43 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టులోని ఎన్. సుశాంత్ 3, మోజస్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 160 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 32.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని మురళి 36 పరుగులు చేశాడు.

నాలుగు వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు విజయం

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో కృష్ణ జట్టుపై 4 వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. ఆ జట్టులోని కెఎన్ శ్రీ నిచ్చయ్ 76, ఎస్. కె. కాజా మొహిద్దిన్ పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని డి. బాలాజీ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 30.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసి నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని ఏ జయతి కృష్ణ 85, హానీస్ వీరారెడ్డి 57 పరుగులు చేశారు. కృష్ణ జట్టులోని ఎన్. రాజేష్ 2, బి. గీత్ 2, ఆర్. ఆదర్శ్ 2 వికెట్లు తీసుకున్నారు.



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కావ్య

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కలికిరి

ముందస్తు జాగ్రత్తలతోనే డయేరియా డెంగీ వ్యాధులను దూరం చేయవచ్చని మేడుకుర్తి సిహెచ్ వైద్యులు కావ్యగంధ తెలిపారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు కలికిరి మండలంలోని కురవపల్లి, యల్లంపల్లి గ్రామాల్లో స్టాప్ డయేరియా, డెంగీ వ్యతిరేక మాసోత్సావాలు, పెద్దల బిసిజి టీకాలు, కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేలపై హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సోమ, గురువారాలలో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అర్హులైన 6 వర్గాలవారికి బిసిజి టీకాలు వేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ముఖ్యంగా చేతులు శుభ్రత పాటించాలని, తాగు నీటిని కాచి చల్లార్చి తాగాలని, వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఒఆర్ఎస్ ప్యాకెట్స్ అన్ని ఆరోగ్య, అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒఆర్ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేయడం తెలిపారు. అనంతరం డెంగీ జ్వరాలు ప్రబలకుండా ఫ్రైడేని డ్రై డేగా పాటించాలని, కిటికీలకు మెష్ కొట్టించుకోవాలని, ఇంటి పరిశరాలలో నీరు నిల్వలేకుండా చేసుకోవాలని సూచించారు. స్పర్శ, నొప్పి లేని మచ్చలు కుష్టు వ్యాధి కావచ్చునని ఇటువంటి మచ్చలు శరీరంలో ఏ భాగంలో అయినా ఉండవచ్చునని వీటిని తొలిదశలో గుర్తించి చికిత్స తీసుకోవాలని అన్నారు. వాటిని నిర్లక్ష్యం చేసిన యెడల నరాలకు జబ్బు విస్తరించి అంగవైకల్యం వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి కృష్ణకుమారి, ఎఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లా వ్యాప్తంగా యథేచ్ఛగా జరుగుతున్న ఇసుక, మట్టి అక్రమ రవాణాను అరికట్టడంలో సంబంధిత శాఖాధికారులు వైఫల్యం చెందారని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు ఆరోపించారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో ఇసుక, మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు తీవ్ర వైఫల్యం చెందారన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంతోపాటు ఇతర ప్రాంతాలలో అక్రమ ఇసుక నిల్వలను గుర్తించి సీజ్ చేసిన ఇసుకను ఉచితంగా ఆ ప్రాంతంలో ఇంటి నిర్మాణాలకు పంపిణీ చేసి భవన నిర్మాణ కార్మికులకు నిర్మాణ పనులు చేసుకొనే అవకాశం కల్పించాలని కోరారు. జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిసర ప్రాంతాల్లో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని ఆక్రమణదారుల నుంచి కాపాడి ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సాంబశివ, వేణుగోపాల్‌రెడ్డి, సలీం బాషా, మురళి పాల్గొన్నారు.

క్రైం కార్నర్



పట్టుబడిన దుంగలు, స్మగ్లర్లతో అటవీ అధికారులు

31 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, సుండుపల్లెలో 31 ఎర్రచందనం దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని బాలుపల్లె అటవీశాఖ పరిధిలో 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు బాలుపల్లె ఎఫ్ఆర్ఇఒ టి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు బాలుపల్లె సెక్షన్ బాలుపల్లె పరిధిలోని కోడూరు మండలం కుక్కలదొడ్డి గ్రామానికి చెందిన చౌదగిరి బాబు, బండి మురళి, కుంభ అయ్యప్ప, వల్లేటి సుబ్రహ్మణ్యం అనే నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని పేర్కొన్నారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగలు 525 కిలోల బరువు ఉన్నాయని తెలిపారు. ఈ దాడుల్లో బాలుపల్లి సెక్షన్ డిఆర్ఒ ఎస్.చంద్రకళ, ఎఫ్ఎస్ఒ ఎం.బాలచంద్రుడు, ఎఫ్‌బిఒలు ఎ.భాగ్యమ్మ, ఆర్.సుబ్బలక్ష్మి, ఎం.సుధాకర్, అబ్రహం లింకన్ పాల్గొన్నారని పాల్గొన్నారు.

సుండుపల్లె : మండలంలోని ముడుంపాడు గ్రామం అటవీ ప్రాంతంలో 8 ఎర్రచందనం దుంగలను శనివారం స్వాధీనం చేసుకోవడంతోపాటు ఒకరిని అదుపులోకి తీసుకున్నామని టాస్క్ ఫోర్స్ పోలీలు పేర్కొన్నారు. టాస్క్ ఫోర్సు ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టాస్క్ ఫోర్సు ఎస్‌పి పి. శ్రీనివాస్ అధ్వర్యంలో డిఎస్‌పి చెంచుబాబు సూచన మేరకు ఆర్ఐ (ఆపరేషన్స్) సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ టీమ్ శుక్రవారం స్థానిక అటవీ శాఖ సిబ్బందితో కలసి సానిపాయ బేస్ క్యాంపు నుంచి రాయవరం మీదుగా ఆవుల దారి, సరస్వతి కటువ, ముడుపాడు అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించారు. లోమోర నిషేధిత అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుంటూ వెళుతూ కనిపించారు. వారిని హెచ్చరించి చుట్టుముట్టగా, వారు దుంగలను పడేసి పారిపోయేందుకు యత్నించారు. టాస్క్ ఫోర్సు సిబ్బంది వారిని వెంబడించి, ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. మిగిలిన వారు చిమ్మ చీకట్లో కలసి పోయారు. పట్టుకున్న వ్యక్తిని తమిళనాడు తిరువన్నామలై జిల్లా అత్తిపట్టు, వీరప్పనూరు పంచాయితీకి చెందిన రమేష్‌గా గుర్తించారు. అతన్ని అరెస్టు చేసి ఆ ప్రాంతంలో పడి ఉన్న 8ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కేసును తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన సిఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు యువకులు ఆత్మహత్య

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలో శుక్రవారం రాత్రి సమయంలో వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు యువకులు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ రఘురాం వివరాల మేరకు రామక్కపల్లె గ్రామానికి చెందిన ఓరుపల్లి జైసింహ (23) అనే వ్యక్తి శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలియజేశారు. పోలీసుల కథనం మేరకు...పెంచలయ్య, యశోద దంపతులకు ఇద్దరు కుమారులు. వీరు జీవనోపాధి నిమిత్తం ఇటీవల కువైట్‌కి వెళ్లారు. అక్కడ కష్టపడి పని చేసుకుంటూ బిడ్డలను పోషించుకుంటూ వస్తున్నారు. మృతుడికి గల్ఫ్ దేశానికి వెళ్లడానికి వీసా వచ్చిన నేపథ్యంలో మెడికల్‌కి వెళ్లి ఫెయిల్ అయ్యాడని మనస్థాపంతో ఉరి వేసుకున్నట్లు పోలీసులు తెలియజేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా కన్నా బిడ్డను కడసారిగా చూసుకోవడానికి వసున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

మండల పరిధిలోని కోటగడ్డ శ్రీ అభయాంజనేయ స్వామి గుడి సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి దలవాయిపల్లి గ్రామానికి చెందిన మల్లు రామానుజులరెడ్డి (31) వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనాల మేరకు...రామానుజులరెడ్డి పదేళ్ల నుంచి కువైట్‌లో ఉన్నాడు. ఇటీవల కువైట్లో కానూన్ సందర్భంగా ఇండియాకు విచ్చేసినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఏమైనా మందలిస్తారేమో అని భయంతో తనలో తానే ఆలోచించి మనస్థాపంతో చెట్టుకు ఉరివేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.